క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శులుగా అభి, క్రాంతికుమార్



అభి, క్రాంతికుమార్‌లను అభినందిస్తున్న పార్టీ నాయకులు

రామచంద్రపురం: జిల్లా వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శులుగా నియోజకవర్గానికి చెందిన పాటి అభి, కుడిపూడి క్రాంతికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు వీరిని సత్కరించి అభినందించారు. వెంకటపతిరాజు, కుడిపూడి గణేష్, సూరంపూడి సుబ్రహ్మణ్యం, జుత్తుగ ఉదయ్‌కుమార్, మందపల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరదాని



కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన అరదాని శ్రీదేవి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు తనకు ఉత్తర్వులు అందినట్టు శుక్రవారం ఆమె తెలిపారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ఆమె మత్స్యకారుల సమస్యలపైనా, మహిళా సమస్యలపైన అవగాహన కలిగిన నాయకురాలిగా రాణిస్తున్నారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునే దిశగా కృషి చేస్తానని శ్రీదేవి అన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అరదాని శ్రీదేవికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



పడమర ఖండ్రిక పాఠశాల్లో విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్త

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో పడమర ఖండ్రిక, అంగర, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు చేశారు. వారి ఆరోగ్య వివరాలను రికార్డులలో నమోదు చేశారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

కాజులూరు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పంచయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు శుక్రవారం గ్రామ వీధుల్లో ట్యాంకర్ల ద్వారా హైపోక్లోరైడ్ ద్రావనాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మరోసారి కరోనా వైరస్ విజృంబిస్తున్నట్టు అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం మెరుగుదలలో భాగంగా తమ సిబ్బంది ప్రతీ రోజు ప్రతి వీధిని శుభ్రపరచి బ్లీచింగ్ చల్లుతున్నారన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆత్రేయపురం విద్యార్థి

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ కళాశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి పి.రజిత్‌కుమార్ నెట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నంబూరి రవిరాజు తెలిపారు. జనవరి 2, 3, 4, 5 తేదీల్లో ఢిల్లీలో జరిగే నెట్‌బాల్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. ఈ సందర్భంగా రజిత్‌కుమార్‌ను కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్‌రాజు తదితరులు అభినందించారు. అలాగే మెర్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8 వతరగతి చదువుతున్న చింతల అనూష నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి తెలిపారు. ఆమెకు సర్పంచ్ మెర్ల రాము రూ.2 వేలు నగదు ప్రోత్సాహం అందించినట్టు తెలిపారు.

అంగరలో వైభవంగా శ్రీపుష్పయాగం



అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీపుష్పయాగం పూజలు నిర్వహించారు. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు కొమాళ్ళపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మండపేటలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరైన దళితులు, వెనుకబడిన తరగతుల వారు



రయ్.. రయ్ మంటూ బైక్‌లపై సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలి వస్తున్న వైఎస్సార్ సీపీ అభిమానులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు. పక్కనే రాష్ట్ర ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి, ఎంపీలు అనురాధ, సుభాష్ చంద్రబోస్

సాధికార యాత్రతో మురిసిన పేట

- ఉత్తేజాన్ని నింపిన నాయకుల ప్రసంగాలు
- సామాజిక అంశాలపై ఎమ్మెల్సీ తోట కృషికి ప్రశంసలు
- సంక్షేమాన్ని అపహాస్యం చేసే పార్టీలను ఓడించాలని పిలుపు

కపిలేశ్వరపురం: శ్రామిక జన కూడలి మండపేట సామాజిక యాత్రతో మురిసింది. కార్మిక, కర్షక సమ్మేళనంతో నిత్యం సందడిగా ఉండే మండపేట వీధులు సామాజిక సాధికార బస్సు యాత్ర బ్యానర్లు, జెండాలు, కరపత్రాలతో సుందరంగా మారాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదలు పెద్ద ఎత్తున మండపేట పట్టణానికి తరలి వచ్చారు. తనపైన , వైఎస్సార్ సీపీ పార్టీపైనా అభిమానాన్ని చూరగొనడంపై ఎమ్మెల్సీ తోట కృతజ్ఞతలు తెలుతూ జనావళికి స్వాగతం పలికారు. బస్సు యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి జోగి రమేష్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులకు ఘన స్వాగతం పలికారు. యాత్ర పొడవునా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్సీ తోట నినాదాలతో హోరెత్తింది. కలువ పువ్వు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన వక్తలు టీడీపీ గత పాలనా తీరును, నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రజా వ్యతిరేక వైఖరిని ఖండించారు.



మండపేట కలువపువ్వు సెంటర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ప్రజా బలంతో వేగుళ్లను ఢీ కొంటా

నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ తీరును వివరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో ధనిక వర్గానికి, పేద వర్గానికి ఎన్నిక జరగనుందన్నారు. ప్రతి ఎన్నికకూ డబ్బులు పెంచుతూ ఎన్నికల్లో గెలుస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళను ప్రజలే ఓడించాలన్నారు. డబ్బు సంచులను నమ్ముకున్న జోగేశ్వరరావును తాను ప్రజా బలంతో ఢీకొంటానన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమాన్ని ఓర్వలేని ప్రతిపక్షాలు నియోజకవర్గంలో అలజడిని సృష్టిస్తూ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. వైఎస్సార్ హయాం తర్వాత పెద్ద స్థాయిలో పేదలకు ఇళ్ల ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ కులగణన చేయాలన్న మహనీయుల కలను సీఎం వైఎస్ జగన్ పాలనలో తీరుతుందన్నారు. సంక్షేమం అమలుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరుల జీవితాల్లో వెలుగు నెలకొందన్నారు. మండపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట కృషి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. ప్రజల్లో పని చేయడమే జీవితంగా ఎమ్మెల్సీ తోట పని చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సోదరులమంతా ఎమ్మెల్సీ తోట వెంట నడవాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. కాపు, శెట్టి బలిజ సామాజిక వర్గీయుల ఐక్యత అవసరాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి మాట్లాడుతూ వైఎస్‌ను దగ్గరుండి చూసిన తనకు ప్రజల కోసం పరితపించే వ్యక్తిత్వం సీఎం జగన్‌లో కనిపిస్తోందన్నారు. కష్టపడి పనిచేస్తున్న ఎమ్మెల్సీ తోట నియోజకవర్గానికి అవసరం అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వ తీరును, ప్రస్తుత ప్రభుత్వ తీరుతో పోల్చుకుని నియోజకవర్గ ప్రజలంతా ఎమ్మెల్సీ తోట వెంట నడవాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ సీఎం జగన్ 50 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తుండటంతో తనలాంటి బీసీ మహిళకు మున్సిపల్ చైర్‌పర్సన్ అయ్యే అవకాశం దక్కిందన్నారు. ఎమ్మెల్సీ తోట తనలాంటి వారికి ఆదర్శమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ చేస్తున్న కృషిని ఓర్వలేక ఎమ్మెల్సీ తోట పై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. ఎన్ని విమర్శలు చేసినా ఎమ్మెల్సీ తోట ప్రజాబలంతో ముందుకు సాగుతారన్నారు. యాత్రలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కురుపూడి భవాని, నల్లమిల్లి మంగాతాయారు, ఎంపీపీలు ఉండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, నౌండు వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, శీలం గోవింద్, తమలంపూడి గంగాధరరెడ్డి, నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు వీధి వెంకటరెడ్డి, మూడు మండలాల సమాఖ్య అధ్యక్షులు వాసా కోటేశ్వరరావు, మట్టపర్తి గోవిందరాజు, ఆరీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

- ఆకట్టుకున్న సైన్స్ రంగవల్లులు
- అబ్బురపరిచిన ప్రదర్శనలు
- అట్టహాసంగా విద్యా వైజ్ఞానిక సదస్సు

రామచంద్రపురం: చిన్నారుల మదిలో వచ్చిన ఆలోచనలు కార్యరూపం దాల్చి పలువురుని అబ్బురపరిచారు. అబ్బురపరిచే సైన్స్ ముగ్గులు, అలరించిన నృత్యాలను చూసి జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సులో రంగవల్లులు ప్రత్యేకార్షణగా నిలిచాయి. ధనుర్మాసంలో వేసే సాధారణ రంగవల్లులకు భిన్నంగా సైన్స్ చిత్రాలతో వేసిన రంగవల్లులు ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పర్యవరణ పరిరక్షణ, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ చంద్రయాన్, గణిత సాధనలు, రసాయనిక ప్రయోగాలు తదితర అంశాలతో రూపొందించిన రంగవల్లులు విద్యార్థులను ఉపాధ్యాయులనే కాకుండా విద్యా వైజ్ఞానిక సదస్సుకు ముఖ్యఅతిథులుగా హాజరైన జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఈవో ఎం.కమలకుమారి, ఇతర అధికారులను కట్టిపడేశాయి. రంగవల్లులను తీర్చిదిద్దిన విద్యార్థులను ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు మేక రామలక్ష్మి, తిరుమలరావు, దేవి, డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్స్ నేతృత్వంలో ఈ ముగ్గులను వేశారు.



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ముందుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. రామచంద్రపురం మండలం వెలంపాలెం ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు గణపతి వేషధారణతో వేసిన ప్రారంభ నృత్యం అలరించింది. దేశభక్తిగీతం,కుచిపూడి నృత్యం, దిమ్సా తదితర నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన విద్యార్థులతోపాటుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉల్లాసంగా పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సైన్స్ రంగ వల్లి



చెట్ల ఉపయోగాలను వివరిస్తూ..




ముగ్గు రూపంలో విస్తరించిన సోషల్ మీడియా



మ్యాథ్స్ ప్రాధాన్యతను తెలుపుతూ..

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం




కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



దంగేరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ రమణ, ఎంపీటీసీ లక్ష్మణ్




రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం



మాచవరం జెడ్పీ హైస్కూల్లో రామానుజన్ నంబర్ 1729 ఆకృతిలో విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: అంబికపల్లి అగ్రహారంలోని రాజారత్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిట్ వరంగల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వి.బిర్లా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు గణితం వల్ల కలిగే ప్రయోజనాలు, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వీఆర్‌ఓలు గోపీనాథ్, రాములు ఈవీఎం తీసుకొవచ్చి విద్యార్థులకు ఈవీఎం ఉపయోగించి ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వంశీపవన్, రామారావు, రవిధర్, శ్రీకాంత్, 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కె.గంగవరం: దంగేరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నేదునూరు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గణిత సంబరాల్లో సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణిత దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈక్వేషన్ ఆకృతిలో విద్యార్థులు

అందించారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు సహకారంతో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. గ్రామ పెద్దలు పోలిశెట్టి బాబురావు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరామయ్య జడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.సత్తిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో గణితావధానం చేశారు. నాగార్జున గణితావధానం చేయగా, పలువురు విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. వారు అడిగే సమస్యలను గణితావధాని నాగార్జున సమాధానాలు చెప్పారు. అలాగే మండలంలో మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో గణితంలోని భావనలు, సిద్ధాంతాలపై రంగవల్లులు తీర్చిదిద్దారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రామానుజన్ నంబర్ 1729 ఆకృతిగా విద్యార్థులు ఏర్పడి ఆయనకు నివాళులర్పించారు.

గణితం మనో వైజ్ఞానిక ప్రగతికి చిహ్నం

కపిలేశ్వరపురం: గణితం మనోవైజ్ఞానిక ప్రగతికి చిహ్నమని కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవంలో పాల్గొన్న వక్తలన్నారు. గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. విద్యార్థులు మేథ్స్ అంశాలను రంగవల్లుల రూపంలో ఆవిష్కరించారు. విద్యార్థులను హెచ్‌ఎం వంగా శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్ బాబు, రమణరావు, కోమలి అభినందించారు. మేథ్స్ ఈక్వేషన్ల ఆకారంలో విద్యార్థులు నిలుచుని గణితంపై తమ మక్కువను చాటుకున్నారు.

మండపేటలో...

మేథ్స్ ప్రాధాన్యతను విద్యార్థులు గుర్తించాలని ద్వారపూడి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గణితాంశాలతో వారు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. చెకుముకి వైజ్ఞానిక పరీక్షలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు ఆచంట దుర్గాప్రసాద్, కడియపు సందీప్, కె.దుర్గాప్రసాద్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, స్టాఫ్ సెక్రెటరీ గండి స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు పలివెల రుద్ర, తూలూరి నరేంద్ర, పాతూరి సునీత, జీవీఎస్ సుబ్రహ్మణ్యశర్మ అభినందించారు.

తాతపూడిలో ఐక్య క్రిస్మస్ వేడుకలు



కేశవరం క్రిస్మస్ వేడుకల్లో వాక్యోపదేశం చేస్తున్న ప్రబోధకుడు

కపిలేశ్వరపురం: మండపేట మండలం కేశవరంలోని షాలోమ్ ప్రార్థనా మందిరంలో గురువారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ ప్రబోధకులు పి.ఏసురత్నం, పాస్టర్ స్పర్జన్, అనిల్ మాట్లాడుతూ మానవ ప్రగతికి బైబిల్ బోధనలు దోహదపడతాయన్నారు. గ్రామానికి చెందిన క్రైస్తవులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రీస్తు కీర్తనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అధ్వానంగా రహదారి



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

కె.గంగవరం: మండలంలోని దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద అప్రొచ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అప్రొచ్ కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు అంటున్నారు. కనీసం ఇక్కడ గ్రావెల్ అయినా ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే అక్కడ అప్రొచ్ నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో సర్వ మతాలకు గౌరవం

రాజోలు: ప్రజాస్వామ్యంలో సర్వ మతాలను గౌరవించుకోవాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి అన్నారు. శుక్రవారం రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సువార్తకులు శ్రావణ్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, అడిషనల్ పీపీ దిగుమర్తి భాస్కరరావు, న్యాయవాదులు జి.స్టాలిన్, ఎడ్విన్ మైఖేల్, నీతిపూడి సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



